

మూడు ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి చర్యలు

విజయనగరం క్రైం: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏఆర్ పోలీసు విభాగంలో నడుస్తున్న పోలీసు సంక్షేమ పాఠశాలలో మూడు ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు ఎస్పీ దీపిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు లెక్కలు, ఫిజికల్ సైన్సు, బయాలజీతో పాటు ఇంగ్లీషు సబ్జెక్టును బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 26న ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించబోయే డెమో, మౌఖిక పరీక్షకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు హెచ్ఎంను 94917 99315, ఆర్ఐను 91211 09485 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు



- పాదయాత్ర సమయంలో ఎన్నో హామీలిచ్చిన జగన్
- వాటికి నేటికీ అతీగతీ లేకపోయె.. కుంటుపడిన అభివృద్ధి
- మూతపడిన పరిశ్రమలు.. సాగునీటికి అవస్థలు

బొబ్బిలిలో మూతపడిన జూట్ పరిశ్రమలను తెరిపిస్తామని పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చారు. వెంగళరాయసాగర్ జలాశయం నుంచి బొబ్బిలి మండలంలో అదనంగా ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. చిత్రకోట జలాశయాన్ని పూర్తి చేస్తామన్నారు. లింకురోడ్డు.. నదులపై వంతెనలు నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తామని అన్నారు. ఇలా జిల్లాలో పాదయాత్ర సమయంలో జగన్ అనేక హామీలు ఇచ్చారు. ఏవీ నెరవేరలేదు. కొన్నింటికి కనీసం అడుగు కూడా పడలేదు. ఇదేం పాలన అంటూ జిల్లా ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)


మూతపడిన ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 2018 సెప్టెంబరు 24 నుంచి ప్రతిపక్ష నాయకుని హోదాలో జగన్ జిల్లాలో పాదయాత్ర చేశారు. ఆ సమయంలో అనేక స్థానిక సమస్యలను ప్రస్తావించారు. అధికారంలో వస్తే వాటన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీఎం అయ్యారు కాని ఇచ్చిన మాటలను మాత్రం ఆచరణలో పెట్టలేకపోయారు. ప్రజాధనంతో ఉచితాల పంపకాల బటన్ నొక్కుడుతోనే సరిపెట్టారు. అభివృద్ధిని వదిలేశారు. టీడీపీ ప్రభుత్వం మంజూరుచేసి చేపట్టిన పనులపై కనీసం దృష్టి పెట్టలేదు. పరిశ్రమలు లేవు. యువతకు ఉపాధి లేదు. ఉద్యోగ అవకాశాలు లేవు. ఐదేళ్లుగా ఇదే పోకడను కొనసాగించి అభివృద్ధిని కుంటుపడేలా చేశారు. కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామం వద్ద 2018 సెప్టెంబరు 24న జిల్లా పరిధిలో పాదయాత్ర ప్రారంభించారు. నవంబరు 22న గరుగుబిల్లి మండలం రావివలస వద్ద పాదయాత్ర ముగిసే వరకు అనేక హామీలు ఇచ్చారు. అలాగే ముఖ్యమంత్రి హోదాలో జిల్లా పర్యటనకు వచ్చినపుడు ఇచ్చిన హామీలు సైతం మరిచారు.

ఉన్న పరిశ్రమలు సైతం మూత

బొబ్బిలి సమీపంలోని లచ్చయ్యపేట చక్కెర కర్మాగారం బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాలకు అంత్యంత కీలకం. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ కార్మాగారాన్ని మూత వేయించారు. ఎన్‌సీఎస్‌కు చెందిన ఈ చక్కెర కార్మాగారం నిలిపేయడంలో మంత్రి బొత్స సత్యనారాయణ కీలకంగా వ్యవహరించారు. అంతే కాకుండా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు పేరుతో ఎన్‌సీఎస్ భూములను సైతం అమ్మకం చేశారు. దీని వెనుక జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కీ రోల్ వహించారు. కోట్లాది రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంత చేసినా ఇంకా రైతుల బకాయిలు రూ.6 కోట్లు ఉంది. భూముల అమ్మకం ద్వారా రూ.16.84 కోట్లు చెల్లించారు. 320 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు.


మూతపడిన జూట్ పరిశ్రమ

- బొబ్బిలి జూట్ పరిశ్రమలకు పెట్టింది పేరు. ఇక్కడ మూతపడిన పరిశ్రమలు తెరిపిస్తామని పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చారు. వీటిని తెరిపించలేదు సరికదా మొత్తంగా ఆయా స్థలాలు అమ్మకాలైపోయాయి. ఇందుకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సహకారం అందించారని సమాచారం. కార్మికుల సమస్యల పరిష్కారం కోసమేనంటూ తమ నిర్ణయాన్ని ఆయన సమర్థించుకున్నారు. ఇలా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో మూత పడ్డాయి.

సాగునీటిదీ అదే తీరు..

ఎమ్మెల్యే శంబంగి తన చిరకాల ఆశయంగా ప్రకటించిన ఎత్తిపోతల పథకాలను కూడా మంజూరు చేయించుకోలేక పోయారు. తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ పరిధిలోని రామన్నదొరవలస వద్ద రెండు ఎత్తిపోతల పథకాలకు అంచనాలు తయారు చేసి పంపించారు. అసెంబ్లీలో సైతం ప్రస్తావించినా ఈ ప్రతిపాదనలను జగన్ ఖాతరు చేయలేదు. మక్కువ మండలంలో సువర్ణముఖి, గోముఖి నదుల అనుసంధానంతో వెంగళరాయసాగర్ జలాశయం ఉంది. దీని నుంచి బొబ్బిలి మండలంలో అదనంగా 5 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్న ప్రతిపాదనలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచీ ఉన్నాయి. తాము అధికారంలోకి వచ్చి పూర్తి చేస్తామని జగన్ ప్రకటించారు. దాని ఊసే లేదు. అలాగే ప్రభుత్వాలు మారుతున్నా పరిష్కారం కాని కంచరిగెడ్డ చిత్రకోట జలాశయాన్ని పూర్తి చేస్తామని జగన్ ప్రకటించారు. ఇది కూడా నెరవేరలేదు.

వంతెనలు కూలినా..

అంతర్ రాష్ట్ర రోడ్డులో వంతెన కూలి ట్రాఫిక్ నిలిచిపోయిన దారుణ పరిణామం ఈ ప్రభుత్వ పాలనలోనే జరిగింది. పాదయాత్రలో భాగంగా లింకురోడ్డు.. నదులపై వంతెనలు పూర్తి చేస్తామని ఒక వైపు జగన్, మరోవైపు ఎమ్మెల్యే హామీలు కురిపించారు. ఏదీ జరగలేదు. భోజరాజపురం-కొత్తపెంట గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వేగావతి నదిపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇందు కోసం రూ.15 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. నిధులు విదల్చని కారణంగా పనులు చేపట్టలేదు. కోమటిపల్లి-కింతలవానిపేట మధ్య ప్రవహిస్తున్న సువర్ణముఖీ నదిపై వంతెన నిర్మిస్తామని ప్రకటించారు. దీనికి అతీగతీ లేదు. నియోజకవర్గంలో లింకు రోడ్డు మొత్తం పూర్తిచేస్తామని ప్రకటించినా అమలు అంతంతమాత్రమే.

- బొబ్బిలి-పార్వతీపురం నియోజకవర్గాలతో పాటు ఒడిశాలోని రాయగడ జిల్లాకు వెళ్లే అంతర్ రాష్ట్ర రోడ్డు మార్గం ఉంది. ఈ మార్గంలో వేగావతి నదిపై పారాది వద్ద బ్రిటీష్ కాలం నాటి వంతెన ఉంది. దీని స్థానంలో నూతన వంతెనలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పాత వంతెన ఒక వైపు కూలిపోయి వాహనాలను అనుమతించడం లేదు. ట్రాఫిక్‌కు తీవ్ర స్థాయిలో నిలిచిపోయింది. అలాగే సీతానగరం వద్ద సువర్ణముఖీ నదిపై వంతెన నిర్మాణ పనులు రూ.11 కోట్లుతో జరుగుతున్నాయి. అయితే బిల్లులు సక్రమంగా చెల్లించని కారణంగా పనులు ఏడాది క్రితం నిలిచిపోయాయి.


బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై ఒరిగిన వంతెన ఇదే

ప్రభుత్వ జూనియర్.. డిగ్రీ కళాశాల ఏవీ

బొబ్బిలి ప్రాంతంలో అంతా ప్రైవేట్ విద్యపైనే ఆధారం. ఇతర మండల కేంద్రాల్లో సైతం ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలున్నాయి. బొబ్బిలి వాసులకు మాత్రం ప్రభుత్వ కళాశాల విద్య ఓ కలగా మిగిలింది. ఈ పరిస్థితిలో బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తామని జగన్ ప్రకటించారు. నేటికీ ఈ హామీ నెరవేరలేదు. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి. ఈ హామీని 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొంటారేమోనని పట్టణ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.



వ్యాపారుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్


తప్పకుండా ఓటేస్తాం

- ప్రతిజ్ఞ చేసిన వస్త్ర వ్యాపారులు
- ఓటుపై అవగాహన కల్పించిన ట్రైనీ కలెక్టర్

కలెక్టరేట్, ఏప్రిల్ 18: వచ్చే ఎన్నికల్లో తామంతా తప్పకుండా ఓటు వేస్తామని విజయనగరం వస్త్ర వ్యాపారులు ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేసేందుకు మానవహారం నిర్వహించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలాజీ క్లాత్ మార్కెట్ వద్ద దస్తుల షాపుల యజమానులకు, వర్కర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ మాట్లాడుతూ ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యతని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధమని చెప్పారు. వచ్చే నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఎప్పుడైనా ఓటు హక్కును వినియోగించుకో వచ్చునని చెప్పారు. ఓటు హక్కును స్వేచ్ఛగా నిర్భయంగా వినియోగించుకుని సరైన వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, స్వీప్ నోడల్ అధికారి హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, బాలాజీ మార్కెట్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరావు తదితరులు ఉన్నారు.

జిల్లాకు చంద్రబాబు.. పవన్





- ఎన్నికల ప్రచారంలో భాగంగా 23న రాక

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ శృంగవరపుకోట, ఏప్రిల్ 18: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ జిల్లాకు వస్తున్నారు. ఐదు రోజుల కిందట విజయనగరం, నెల్లిమర్ల రావాల్సి ఉండగా పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఈ నెల 23న పర్యటన ఖరారైంది. ఇదిలా ఉండగా అంతకుముందు ఈ నెల 21న చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా శృంగవరపుకోట వస్తున్నారు. టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి ఆ రోజు సాయంత్రం స్థానిక దేవిబొమ్మ కూడలిలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరామప్రసాద్ గురువారం స్థల పరిశీలన చేశారు. ఎన్నికల ప్రచారం అనంతరం చంద్రబాబు రాత్రి బసకు కూడా స్థానికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు నెలల క్రితం 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం ఇక్కడ చేపట్టారు. నెల రోజుల క్రితం ఈ నియోజకవర్గ పరిధిలోని లక్కవరపుకోట మండలం సోంపురం కూడలి వద్ద పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభ నిర్వహించారు. టీడీపీ కంచుకోట శృంగవరపుకోటను గత ఎన్నికల్లో కోల్పోవడంతో ఈ ఎన్నికల్లో అధినేత ప్రత్యేక దృష్టిసారించారు.

మొదటిరోజు 10 నామినేషన్లు

- మూడు చోట్ల నిల్.. పార్లమెంట్‌కు రెండు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల స్వీకరణలో మొదటి రోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు గురువారం వాటిని స్వీకరించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆయా చోట్ల హడావిడి కనిపించింది. అయితే చాలా మంది అభ్యర్థులు మంచి రోజు, జన్మ నక్షత్రం, పేరు ప్రకారం ముహూర్తాలను పెట్టుకుంటున్నారు. శుక్రవారం, శనివారం ఎక్కువ మంది నామినేషన్లు వేసేందుకు అవకాశం ఉంది. ఇదిలా ఉండగా చీపురుపల్లి, రాజాం, గజపతినగరం నియోజకవర్గాల్లో మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా పడలేదు. విజయనగరం పార్లమెంట్‌కు రెండు నామినేషన్లు వచ్చాయి. సమాజ్‌వాది పార్టీ నుంచి ఒకరు, యుగ తులసి పార్టీ నుంచి ఒకరు నామినేషన్ వేశారు.

మొదటిరోజు ఇలా..

నియోజకవర్గం	నామినేషన్లు
విజయనగరం	2
నెల్లిమర్ల	5
ఎస్.కోట	2
బొబ్బిలి	1
చీపురుపల్లి	0
రాజాం	0
గజపతినగరం	0
విజయనగరం ఎంపీ	2


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అంతటా నిఘా

- అంతర్ జిల్లా చెక్‌పోస్టులు 4 , సాధారణ చెక్‌పోస్టులు 21
- మద్యం.. డబ్బు తరలింపుపై 38 కేసులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 18 : ఎన్నికలు సమీపిస్తుండటంతో పోలీసులు జిల్లాను జల్లెడపడుతున్నారు. 24/7 సాయుధ బలగాలతో వివిధ మార్గాల్లో తనిఖీలు చేస్తూ అక్రమంగా తరలిస్తున్న డబ్బు, బంగారం, మద్యం సీజ్ చేస్తున్నారు. ఈ ఘటనల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులపై 38 కేసులను నమోదు చేశారు. జిల్లాలోకి అక్రమంగా మద్యం, డబ్బులు, ఇతరత్రా వస్తు సామగ్రి ప్రవేశించకుండా 4 అంతర్జాతీయ చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. విశాఖ నుంచి జిల్లాకు వచ్చే రాజాపులోవ జంక్షన్ వద్ద ఒకటి, ఎస్.కోట నియోజకవర్గంలోని బొడ్డవర, రాజాం సమీపంలోని పొగిరి, బొబ్బిలి వద్ద ఒకటి ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రతి నియోజకవర్గ పరిధిలో 3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. 18వ తేదీ నుంచి కోడ్ అమలు కావటంతో అప్పటి నుంచి తనిఖీలకు ఉపక్రమించారు. ధ్రువీకరణపత్రాలు లేకుండా తీసుకువెళ్లే చీరలు, వెండి, బంగారం, క్రీడా సామగ్రి, ప్రచార సామగ్రీ, నగదును సీజ్ చేస్తున్నారు. గురువారం నుంచి మూడు సిఫ్టులుగా పోలీసులు, రెవెన్యూ, ఎలక్షన్ బృందాలు నిఘా పెంచాయి. ఇదే విషయమై ఎస్పీ దీపిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని, హద్దుమీరితే కేసులు తప్పవని చెప్పారు. తాజాగా పట్టణాలు, నగరం, గ్రామాల్లో ఇన్ఫర్మేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

నాడు అన్నార్తుల నిలయం.. నేడు వృథా భవనం

నాడు





ఐదేళ్ల కిందట పేదలకు కడుపు నిండా భోజనం పెట్టి వారి ఆకలి తీర్చే భవనమిది. చౌకగా.. తృప్తిగా.. రంచన్‌గా అన్నం పెట్టేది. కూలీలు, నిరుద్యోగులు, పేదలు, యాచకులతో కళకళలాడేది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అంతా మారిపోయింది. అన్నం పెట్టే క్యాంటీన్‌ను అర్థాంతరంగా మూసేసింది. పేదలకు చౌక భోజనం దూరం చేసింది. ఫలితంగా కళగా ఉండే భవనం వెలవెలబోతోంది. అన్నార్తులు భోజనం చేసిన చోటు అధ్వాన పరిసరాలతో కనిపిస్తోంది.

\- విజయనగరం

నేడు



(రాజాం)

రాజాం... నిన్న మొన్నటి వరకు శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ఈ నియోజకవర్గం.. ఇప్పుడు విజయనగరం జిల్లాలో చేరింది. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. రాజకీయ యుద్ధాలకు పేరుమోసిన ప్రాంతం. పూర్వాశ్రమంలో ఉణుకూరు నియోజకవర్గంగా ఉండేది. 2009లో పునర్విభజనతో రాజాం నియోజకవర్గంగా అవతరించింది. జనరల్ స్థానం కాస్తా ఎస్సీ కావడంతో రెండు కుటుంబాల మధ్య రాజకీయ యుద్ధానికి తెరపడింది.

• ఒకప్పుడు ఉణుకూరు.. • టీడీపీ ఆవిర్భావం తరువాత ఆరు ఎన్నికలు • అందులో ఐదుసార్లు గెలిచింది తెలుగుదేశమే
• నాలుగుసార్లు సత్తా చాటిన కళా వెంకటరావు • 2009లో రాజాం ఆవిర్భావం • ఒకసారి కాంగ్రెస్... రెండుసార్లు వైసీపీ విజయం

రాజాం నియోజకవర్గ ముఖచిత్రం

రాజాం.. ఏమిటో ఓటరు మనోగతం!

అప్పట్లో ఉణుకూరుగా...

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉణుకూరు నియోజకవర్గం ఉండేది. 1952లో ఈ నియోజకవర్గం ఆవిర్భవించింది. రాజాం, వంగర మండలాలతో పాటు రేగిడి ఆమదాలవలస మండలంలోని 22 పంచాయతీలతో ఉణుకూరు నియోజకవర్గం సాగేది. ఈ నియోజకవర్గంలో దశాబ్దాలుగా పాలవలస కుటుంబం హవా నడిచింది. ఆ కుటుంబానికి చెందిన పాలవలస రుక్మిణమ్మ, సంగంనాయుడు, రాజశేఖరం కాంగ్రెస్ పార్టీ తరుపున గెలుపొందుతూ వచ్చారు. కానీ 1983లో టీడీపీ ఆవిర్భావంతో పాలవలస కుటుంబానికి చెక్ పెట్టారు కళా వెంకటరావు. రెండున్నర పదుల వయసులో టీడీపీ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు కళా వెంకటరావు. కిమిడి వెంకటరావుకు ఎన్టీఆర్ 'కళ' అనే బిరుదును జోడించారు. అప్పటి నుంచి కిమిడి కళా వెంకటరావుగా పేరొందారు. 1983, 1985, 1989 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కళా వెంకటరావు హ్యాట్రిక్ విజయం సాధించారు. 1994లో మాత్రం పాలవలస రాజశేఖరం చేతిలో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో ఒక్క ఉణుకూరు తప్ప అన్ని స్థానాలను టీడీపీ గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ తరపున పాలవలస రాజశేఖరం ఒక్కరే గెలిచారు. ఈ నేపథ్యంలో 1997లో కళా వెంకటరావు టీడీపీ తరపున రాజ్యసభ సభ్యుడయ్యారు. దీంతో 1999లో ఉణుకూరు నియోజకవర్గం నుంచి కళా వెంకటరావు సోదరుడు కిమిడి గణపతిరావు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2004లో మరోసారి కళా వెంకటరావు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఉణుకూరు కనుమరుగైంది. రాజాం నియోజకవర్గం తెరపైకి వచ్చింది. ఎస్సీలకు రిజర్వ్ కావడంతో కళా వెంకటరావు నియోజకవర్గం మారాల్సిన అనివార్య పరిస్థితి ఎదురైంది. టీడీపీ ఆవిర్భావం తరువాత 2004 వరకూ ఆరు ఎన్నికలు జరుగగా.. ఐదుసార్లు టీడీపీ గెలవడం... అందులో నాలుగుసార్లు కళా వెంకటరావు గెలవడం విశేషం.

మార్పు ఎవరికి వరమో...

ఈసారి ఎన్నికల్లో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులును తప్పించింది. విశాఖ జిల్లా పాయకరావుపేటకు పంపించింది. ఇక్కడ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య కుమారుడు డాక్టర్ రాజేష్‌ను బరిలో దించింది. టీడీపీ మాత్రం మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌కు మరోసారి టిక్కెట్ కేటయించింది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో టీడీపీకి విజయం దక్కలేదు. అందుకే ఈ ఎన్నికల్లో ఆ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఈసారి ఓటరు ఎవరిపై తమ అభిమానాన్ని చూపిస్తారో చూడాలి.



రాజాం నియోజకవర్గ కేంద్రం



కళా వెంకటరావు



పాలవలస రాజశేఖరం



కోండ్రు మురళీ మోహన్



కిమిడి గణపతిరావు



కంబాల జోగులు



కావలి ప్రతిభా భారతి

ఓటర్ల వివరాలు..

మొత్తం ఓటర్ల సంఖ్య:	2,24,227
పురుషులు:	1,11253
మహిళలు :	1,11,253
థర్డ్ జెండర్ :	19



పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

రాజాం నియోజకవర్గం మ్యాప్

రాజాం ఇలా...

2009లో ఆవిర్భవించిన రాజాం నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ అయ్యింది. అదే సమయంలో ఎస్సీ నియోజకవర్గంగా ఉన్న ఎచ్చెర్ల జనరల్‌గా మారింది. దీంతో అక్కడి నాయకులు ఇక్కడికి... ఇక్కడి నాయకులు అక్కడికి వెళ్లాల్సి వచ్చింది. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా కోండ్రు మురళీమోహన్ పోటీచేశారు. టీడీపీ అభ్యర్థి కావలి ప్రతిభాభారతిపై 27,133 ఓట్లతో విజయం సాధించారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా కంబాల జోగులు పోటీచేశారు. టీడీపీ అభ్యర్థిగా కావలి ప్రతిభాభారతిపై కేవలం 512 ఓట్లతో మాత్రమే విజయం సాధించారు. 2019 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ టీడీపీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీచేశారు. వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు చేతిలో 16,848 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందినది.



రాజాం పట్టణంలోని ఎర్రచెరువు

ఎమ్మెల్యేలు ఎంపీలు ఇద్దరు

• ఇదీ జామి మండలం ప్రత్యేకత

శృంగవరపుకోట: ఇద్దరు ఎమ్మెల్యేలు... ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న మండలం జామి. ఈ మండలంలో శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలో కొన్ని గ్రామాలు... గజపతినగరం నియోజకవర్గ పరిధిలో మరి కొన్ని గ్రామాలు ఉన్నాయి. మొత్తం 25 గ్రామాలు ఉన్నాయి. శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలో 13 గ్రామాలు... జామి, చింతాడ, పావాడ, జాగరం, తానవరం, లక్ష్మీపురం, అలమండ, రామభద్రపురం, జట్టేడివలస, రామయ్యమ్మపాలెం, గొడుకొమ్ము, శిరికివానిపాలెం, కలగాడ ఉన్నాయి. గజపతినగరం నియోజకవర్గ పరిధిలో 12 గ్రామాలు... భీమసింగి, కుమరాం, అట్టాడ, మొకాసు కొత్తవలస, అన్నమురాజుపేట, లొట్లపల్లి, వెన్నె, శాసనపల్లి, వెంకటరాజుపాలెం, జన్నివలస, తాండ్రింగి, విజినిగిరి ఉన్నాయి. శృంగవరపుకోట నియోజకవర్గం విశాఖపట్టణం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనూ... గజపతినగరం నియోజకవర్గం విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనూ ఉన్నాయి. దీంతో ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఎన్నికలొస్తే ఇద్దరు ఎమ్మెల్యే అభ్యర్థులు... ఇద్దరు ఎంపీ అభ్యర్థుల ప్రచారాలతో ఈ మండలంలో సందడి నెలకొంటుంది.

నామినేషన్ల దాఖలుకు పటిష్ఠ భద్రత

• పాలకొండ ఆర్వో కల్పనాకుమారి



డీఎస్పీతో చర్చిస్తున్న ఆర్వో కల్పనాకుమారి

సీతంపేట: నామినేషన్లు వేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి సూచించారు. ఈ అంశంపై గురువారం తన కార్యాలయంలో పాలకొండ డీఎస్పీ కృష్ణారావుతో చర్చించారు. అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వచ్చే సమయంలో అనుచరులు, కార్యకర్తలు, నాయకులను రిటర్నిగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ఉంచాలన్నారు. ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇదిలా ఉండగా తొలిరోజు గురువారం ఎవరూ నామినేషన్లు వేయలేదని ఆమె తెలిపారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు వేసుకోవచ్చని, ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ చంద్రమౌళి, ఎస్ఐ జగదీష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

డబ్బు తీసుకెళుతున్నారా?

• ఎన్నికల నిబంధనలు మరచిపోవద్దు • రూ.50వేలకు మించి తీసుకెళ్లకూడదు
• సరైన ఆధారాలు సమర్పించాల్సిందే

గంట్యాడ: ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు అన్ని చోట్లా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. వాహనాలతో పాటు ప్రజలు తమతో పాటు తీసుకెళ్తున్న బ్యాగులు, ఇతర వస్తువులు సైతం పరిశీలిస్తున్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్తే స్వాధీనం చేసుకుంటారు. కొన్నిసార్లు సొంత పనుల మీద ఇతర ప్రాంతాలకు నగదు తీసుకువెళ్తున్నా ఇబ్బందులు తప్పవు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు తగిన ఆధారాలతో అధిక మొత్తంలో నగదు తీసుకుని వెళ్లవచ్చు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు(ఫైల్)

ఫైనాన్స్..చిట్టీల వ్యాపారం

చిట్టీల, ఫైనాన్స్ సంస్థల్లో నిత్యం భారీగా లావాదేవీలు జరుగుతాయి. కలెక్షన్ ఏజెంట్ల వద్ద రూ.లక్షల్లో నగదు ఉంటుంది. వీరు ఆ రోజు చేసిన కలెక్షన్ పద్దులు, బాకీ ఉన్న నగదు.. వసూలైన మొత్తం.. ఇలా అన్ని వివరాలతో పాటు కస్టమర్ల సంతకంతో కూడిన ప్రతులను తప్పసరిగా తమ వెంట ఉంచుకోవాలి.

బంగారు ఆభరణాల కొనుగోలులో...

శుభకార్యాలు నిర్వహించే సమయంలో బంగారు, ఇతర వస్తువుల కొనుగోలుకు నగదు తీసుకు వెళతారు. శుభకార్యాల కోసం నగదు తీసుకువెళ్లే వారు తమ వెంట శుభలేఖ ఉంచుకోవాలి. అదే విధంగా పోలీసులు అడిగిన అన్ని వివరాలకు పూర్తిగా సమచారం ఇవ్వాలి.

బ్యాంకు లావాదేవీలకు...

బ్యాంకు లావాదేవీలు రూ.50 వేలు మించితే ఆధారాలు చూపించాలి. చెక్కు ద్వారా నగదు విత్ డ్రా చేస్తే చెక్కు జెరాక్స్, పాస్ బుక్ ఉంచుకోవాలి. ఏటీఎం ద్వారా నగదు విత్ డ్రా చేస్తే ఏటీఎం స్లిప్‌లు జాగ్రత్త చేయాలి. ఒక వేళ నగదు బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళితే... సంబంధిత అన్ని వివరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఎవరు, ఎందుకు ఇచ్చారో ఆధారాలు ఉండాలి.

విద్యా సంస్థల్లో ఫీజులు

పిల్లలు చదువుల కోసం సంబంధిత పాఠశాల, కళాశాలల యాజమాన్యాలకు ఫీజులు చెల్లించాలంటే నగదు తీసుకుని వెళ్లలక తప్పదు. అటువంటి సమయంలో సంబంధిత కళాశాల యాజమాన్యాలు ఇచ్చిన రసీదు తప్పకుండా ఉండాలి. నగదు చెల్లించకముందు ఫీజు కట్టాలనే నోటీసులు వెంట ఉంచుకోవాలి. అవసరమైతే ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించడం మంచిది.

ఆసుపత్రుల బిల్లులకు...

అత్యవసర సమయాల్లో అధిక మొత్తంలో ఆసుపత్రి బిల్లులు చెల్లించక తప్పదు. అటువంటి సమయంలో రోగి మెడికల్ కేస్ షీట్, మెడికల్ సర్టిఫికెట్, ఆస్పత్రి బిల్లులు అందుబాటులో ఉంచుకోవాలి.

మొదలయ్యాయి



• తొలి రోజు స్వల్ప సంఖ్యలో నామినేషన్లు

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి తొలి రోజు గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. పి.కరుణాకర్ (సమాజ్‌వాదీ పార్టీ), మండల శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి) నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్లను ఆర్‌డీఓ కార్తీక్ స్వీకరించారు. రెండో రోజు శుక్రవారం ఏకాదశి... మంచి రోజు కావడంతో ఎక్కువ నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

బొబ్బిలిలో..

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు గురువారం తొలిరోజు ఒక అభ్యర్థి రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ముగడ వెంకటరమణ కాంగ్రెస్ పార్టీ తరపున ఒకటి, ఇండిపెండెంట్‌గా మరొక నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎ.సాయిశ్రీకి అందజేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు మలిరెడ్డి నాగేశ్వరరావు, తిరుమలరావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మెల్యే బడ్డుకొండ...

నెల్లిమర్ల: నెల్లిమర్ల నియోజక వర్గ వైసీపీ ఎంఎల్ఎ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం నామినేషన్ దాఖలుచేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజుకు మూడు సెట్ల నామినేషన్ పత్రాలను బడ్డుకొండ సమర్పించారు.

స్వతంత్ర అభ్యర్థిగా నిమ్మక జయరాజ్...

కురుపాం: కురుపాం(షె.తె.)అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మొట్టమొదటి నామినేషన్ మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వెంకట రమణకు గురువారం ఆయన నామినేషన్ పత్రాలను అందజేశారు.

ఎస్.కోటలో రెండు...

శృంగవరపుకోట: శృంగవరపుకోట శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఎస్.కోట మండలం శివరామరాజుపేటకు చెందిన కోట్యాడ లోకాభి రామకోటి స్వతంత్ర అభ్యర్థిగా.. కొత్తవలస మండలం కంటికాపల్లి శివారు కొత్తూరు గ్రామానికి చెందిన యల్ల వెంకటరావు జాతీయ జనసేన పార్టీ తరపున నామినేషన్లు అందించారని చెప్పారు.

నేడు కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి నామినేషన్

విజయనగరం రూరల్: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం సెల్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఏకాదశి... మంచి రోజు కావడంతో జ్యోతిష్యులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఆయన నామినేషన్ దాఖలు చేయనున్నారు. విజయనగరం పార్టీ కార్యాలయం (అశోక్ బంగ్లా) నుంచి కలెక్టరేట్ వరకూ టీడీపీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లి... నామినేషన్ దాఖలు చేస్తారు.

• విజయనగరం నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా అదితి గజపతిరాజు ఈ నెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 8 గంటలకు కోట వద్ద నుంచి టీడీపీ శ్రేణులు ర్యాలీగా ఆమె వెంట నడవనున్నారు. మూడులాంతర్ల వద్దనున్న పైడిమాంబ చదురుగుడి వద్ద అదితి గజపతిరాజుతో పాటు, టీడీపీ నాయకులు ఆ రోజు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం నామినేషన్ దాఖలు చేస్తారు.

24న కోళ్ల లలిత కుమారి..

శృంగవరపుకోట: శృంగవరపుకోట శాసన సభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు మూహర్తం నిర్ణయించారు. తొలుత ఈనెల 22న నామినేషన్ వేయాలని అనుకున్నారు. ఈ నెల 21న సాయంత్రం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. రాత్రి ఇక్కడ బస చేసే అవకాశం ఉంది. మరుసటి రోజు తిరిగి ప్రయాణమయ్యే వరకు చంద్రబాబు నాయుడుతో పాటు ఉండాలి. దీంతో ముహూర్తాన్ని మార్పు చేశారు. వైసీపీ అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం 10.59 గంటలకు నామినేషన్ సమర్పించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

పాలకొండ నియోజకవర్గ పరిధిలో గల భామిని, సీతంపేట మండలాల్లోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీ ఒక్కటీ నెరవేరలేదని ఆ మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు పర్యటించిన ఆ ప్రజాప్రతినిధి చెప్పిన వాటిలో.. ఐదేళ్లలో చేసిందేమీ లేదని మండిపడుతున్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆ హామీలు ఓసారి చూద్దాం.

మరచిపోయారో.. మారిపోయారో!

- కార్యరూపం దాల్చని హామీలు
- ప్రజాప్రతినిధి పనితీరుపై పెదవి విరుపు



అభివృద్ధికి దూరంగా మిగిలిపోయిన భాజీపురం గ్రామం

(భామిని)

గత ఎన్నికల్లో వైసీపీ తరఫున గెలుపొందిన ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మిగిలాయి. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండల ప్రజలు నిట్టూరుస్తున్నారు.

● మండలానికి డిగ్రీ కళాశాల, మహిళా జూనియర్ కళాశాల, గిరిజన ప్రాంతాల్లో పక్కా గృహాలు, గ్రామాల అభివృద్ధి, నేరడి బ్యారేజ్ నిర్మాణంతో తాగు నీరు అందిస్తామన్న హామీలన్నీ నీటిమూటలుగా మిగిలాయి. కొండ ప్రాంతాల్లో ఈ ఐదేళ్లలో తమకు రావాల్సిన పథకాలకు మంగళం పాడేశారని అంటున్నారు.

● గతంలో టీడీపీ ప్రభుత్వం మనుమకొండ, వడ్డంగి, పాలవలస లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేసింది. వంశధార నది నుంచి నీటిని తరలించేందుకు ప్రజాప్రతినిధి కనీసం దృష్టి సారించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నేరడి బ్యారేజ్ నిర్మాణం పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అదే సమయంలో నీటి పారుదల శాఖ మంత్రులుగా పనిచేసిన ఇద్దరు వేర్వేరుగా నేరడి బ్యారేజ్‌ను పరిశీలించి అంచనాలు వేసి రైతులకు సాగునీరు అందించడమే ధ్యేయమని వాగ్దానాలు చేశారు. ఇవి కూడా నెరవేరలేదు. కొండలోవగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయలేదు. ఏ గ్రామం వెళ్లినా సమస్యలే కనిపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



నేరడి బ్యారేజ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి తదితరులు (ఫైల్)



రోడ్డన్నారు.. కల్వర్టులు వేస్తామన్నారు

- ఒక్కటీ నెరవేరని వైనం
- ఆందోళనలో గిరిజనులు



తాగునీరు, రహదారులకు నోచుకోని మూలగూడ గిరిజన గ్రామం

(సీతంపేట)

మండలంలోని మారుమూల పంచాయతీ పరిధిలో ఉన్న మూలగూడ, బెనరాయి గ్రామాల్లో గత ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు తమకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదని ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● మర్రిపాడు నుంచి కొత్తగా ఏర్పడిన బెనరాయి పంచాయతీ పరిధిలో ఉన్న బెనరాయి, మేడి ఒప్పంగి మధ్య అనుసంధాన రహదారి... గ్రామాల్లో గెడ్డ వద్ద కల్వర్టులు కడతామని... ఈతమానుగూడలో 200 మీటర్ల వరద గోడ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

● బెనరాయిలో వంద మీటర్ల వరదగోడ మంజూరు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు పూర్తి కాలేదని బెనరాయికి చెందిన మాజీ సర్పంచ్ సవర బాపయ్య స్పష్టం చేశారు.

● మర్రిపాడు పంచాయతీ పరిధిలో ఉన్న మూలగూడ గ్రామంలో 120 మంది గిరిజన జనాభా ఉన్నారు. 70 మంది ఓటర్లను కలిగి ఉన్న ఈ గ్రామంలో సీసీ రహదారి, తాగునీరు, వరదగోడలు మంజూరు చేస్తామని గతంలో హామీనిచ్చినప్పటికీ ఇంతవరకు నెరవేర్చలేదని, ప్రస్తుతం తాగునీటికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నట్టు ఆ గ్రామానికి చెందిన సవర జమ్మయ్య స్పష్టం చేశారు. తమ గ్రామాలు కమ్యూనిస్టు పార్టీకి అనుకూలంగా ఉండడం వల్లనే అభివృద్ధి జరగడం లేదని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హామీలు మరిచారు



గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పాలకులు మరిచిపోయారు. ఒక్కటి కూడా అమలు చేయ లేదు. దీంతో మా గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంగానే మిగిలిపోయింది.

- సవర సుగన్న, మాజీ సర్పంచ్, బెనరాయి

తాగునీటికి ఇబ్బంది



గత ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన నాయకులు గెలిచిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. మా గ్రామంలో తాగునీటి సమస్య తీరుస్తామని, వరదగోడలు కడతామని... రహదారి నిర్మిస్తామని ఇచ్చిన హామీలేవీ నేటికీ నెరవేర్చలేదు.

- సవర జమ్మయ్య, మూలగూడ


అరకు పార్లమెంటు పరిధిలో మన ఓటర్లు ఎందరంటే..

(పార్వతీపురం, ఆంధ్రజ్యోతి)

అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో 2024 జనవరి 22న విడుదల చేసిన తుది ఓటర్ల జాబితా మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో 7,75,598 మంది ఉండగా.. అందులో పాలకొండ ఎస్టీ నియోజకవర్గంలో 94,328 మంది పురుషులు, 99,325 మంది మహిళలు, 14 మంది థర్డ్‌జెండర్...వెరశి 1,93,667 మంది ఓటర్లు ఉన్నారు. కురుపాం ఎస్టీ నియోజకవర్గంలో 93,592 మంది పురుషులు, 99,005 మంది మహిళలు, 39 మంది థర్డ్‌జెండర్... వెరశి 1,92,636 మంది ఓటర్లు ఉన్నారు. పార్వతీపురం ఎస్సీ నియోజకవర్గంలో 92,655 మంది పురుషులు, 95,188 మంది మహిళలు, 11 మంది థర్డ్‌జెండర్ వెరశి 1,87,854 మంది ఓటర్లు ఉన్నారు. సాలూరు ఎస్టీ నియోజకవర్గంలో 98, 189 మంది పురుషులు, 1,03,248 మహిళలు, నలుగురు థర్డ్ జెండర్ వెరశి 2,01,441 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు..

పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 1031 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పాలకొండ నియోజకవర్గంలో 287, కురుపాంలో 268, పార్వతీపురంలో 233, సాలూరులో 243 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.



తుపాకులు ఇచ్చేశారు!

- ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తం

(విజయనగరం క్రైం)

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈసీ నిబంధనల ప్రకారం పోలీసులు అప్రమత్తమయ్యారు. తుపాకీ లైసెన్స్‌లు కలవారంతా ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ తమకు ఆయుధాలను అందజేయాలంటూ పోలీసులు వారికి లేఖలు రాశారు. ఆమేరకు సంబంధిత వ్యక్తులు తుపాకులను పోలీసులకు అప్పగించేశారు. ఎప్పుడు సార్వత్రిక ఎన్నికలు జరిగినా... ఈ ప్రక్రియను పోలీసులు పూర్తి చేయడం ఆనవాయితీ. స్వీయ రక్షణ కోసం తుపాకీ కావాలంటూ కొందరు వ్యక్తులు పోలీసుశాఖకు దరఖాస్తు చేస్తారు. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి... ప్రవర్తన తదితర వాటిని స్థానిక పోలీసులతో పాటు, స్పెషల్ బ్రాంచ్ ద్వారా విచారణ చేపట్టి.. అర్హులైతే తుపాకుల లైసెన్స్ ఇస్తారు. ఇలా లైసెన్సు జారీ చేసినప్పుడు...పోలీసులు కొన్ని షరతులు పెడతారు. తాము అడిగినప్పుడు... ప్రత్యేక సందర్భాల్లో తిరిగి తుపాకిని తమకు స్వాధీనపరచాలన్న నిబంధన విధిస్తారు. ఈ నిబంధన పత్రం మీద ఆ వ్యక్తి సంతకం చేస్తారు. విజయనగరం జిల్లాలో ఎస్‌బీఎల్, డీబీబీఎల్, పిస్టల్, రైఫిల్స్ మొత్తం 445 ఉన్నాయి. వీటిలో ఈ నెల 17వ తేదీ నాటికి 68 మినహా మిగతా అన్ని పోలీసు శాఖ స్వాధీనం చేసుకుంది. 68లో ఎనిమిదింటిని హైకోర్టులో కేసులు ఉన్న కారణంగా అప్పగించలేదు. 60 తుపాకులు బ్యాంకు సిబ్బంది ఆధీనంలో ఉన్నాయి.



బైండోవర్లు కీలకం

- 14,344 బైండోవర్ కేసులు
- 111 మంది రౌడీ షీటర్లు



కౌన్సిలింగ్ చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైం: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా... అల్లరిమూకలు, పాత నేరస్థులు తదితరులపై పోలీసులు దృష్టి పెట్టారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చింది మొదలు సంబంధిత స్టేషన్ ఆఫీసర్ల పర్యవేక్షణలో బైండోవర్ కేసుల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 14,344 మందిని బైండోవర్ చేశారు. విజయనగరం జిల్లాలో గల ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 33 స్టేషన్‌ల పరిధిలో 14,344 మందిపై బైండోవర్ కేసులు నమో దయ్యాయి. పాత నేరస్థులకు సంబంధించి 111 మంది పై రౌడీషీట్లు తెరిచారు. వీరందరికీ ఇప్పటికే పోలీసు స్టేషన్లకు రప్పించి...కౌన్సిలింగ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని... ఇబ్బంది కలిగిస్తే అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విజయనగరం జిల్లాలో 14,344 బైండోవర్ కేసులకు సంబంధించి అధికార వైసీపీపై 7,980, టీడీపీ 7,511, జనసేన 526, ఇతరులు 296 మందిపై నమోదు చేశారు. వీరితో పాటు, రౌడీ షీటర్లకు సంబంధించి 111 మందిని గుర్తించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ క్షేత్రస్థాయిలో ఉన్న సచివాలయ పోలీసులతో పాటు, స్థానిక పోలీసులు ఎప్పటికప్పుడు వీరిపై నిఘా ఉంచుతారు. అల్లర్లకు పాల్పడితే వెంటనే వీరిని అదుపులోకి తీసుకుంటారు.

'లెక్క' తేలుస్తారు!

- జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు




వ్యయ పరిశీలకులతో కలెక్టర్, ఎస్పీ

కలెక్టరేట్: ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రాజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ గురువారం సాయంత్రం జిల్లాకు చేరుకున్నారు. వీరిని జెడ్పీ అతిథి గృహం వద్ద కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికల పరిస్థితిని.. తీసుకుంటున్న చర్యలను వివరించారు. వీరి వెంట లైజన్ అధికారులు ఉన్నారు.

టీడీపీ సానుభూతిపరులని.. రోడ్డు వేయలే!

- మంజూరైన నిధుల మళ్లింపు
- ఐదేళ్లుగా ఆ కాలనీ వాసుల అవస్థలు

గజపతినగరం: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెబుతున్న అధికార పార్టీ వైసీపీ నాయకుల వివక్షకు ఈ ఘటన ఉదాహరణగా నిలుస్తుంది. టీడీపీ హయాంలో పురిటిపెంట పంచాయతీ రైల్వే కాలనీ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అనంతరం ఎన్నికలు రావడంతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ రోడ్డు నిర్మాణం సంగతి పట్టించుకోలేదు. ఈ రోడ్డు మార్గంలో కాలనీ అంతా టీడీపీదే ఆధిపత్యం అని వచ్చిన నిధులను వైసీపీ నాయకులు వేరొక వైపు మళ్లించేశారని ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గజపతినగరంతో పాటు బొండపల్లి, మెంటాడ మండలాలకు చెందిన వందలాది మంది ప్రయాణికులు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు గోతుల మయమైపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నామని ప్రయాణికులతో పాటు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు మరమ్మతు పనులతో పాటు డ్రైనేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు అప్పటి ఎమ్మెల్యే కేఏ నాయుడు మంజూరు చేశారు. పనులు ప్రారం భించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో చేపట్టలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఈ రోడ్డు సమస్య పరిష్కారం కావడం లేదు. టీడీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన నిధులతో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పాత ఎంపీడీవో కార్యాలయం వరకు రోడ్డు వేసి ఖర్చు చేశారు. రైల్వే కాలనీలో అంతా టీడీపీ సానుభూతిపరులు కావడంతో ఇక్కడి నిధులను ప్రస్తుత ఎమ్మెల్యే మళ్లించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం మారితే తమ రోడ్డు పరిస్థితి మారుతుందని స్థానికులతో పాటు ప్రయాణికులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.



రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

అటువైపు వెళ్లొద్దు

- కలెక్టరేట్ నిర్మానుష్యం
- ఎవరినీ అనుమతించని వైనం
- బారికేడ్లు వేసి నియంత్రణ
- నామినేషన్ల స్వీకరణ ఫలితం

ఈ చిత్రం చూశారా? నిత్యం జనాలతో కళకళలాడే విజయనగరం కలెక్టరేట్ ఎలా బోసిపోయిందో... ఇదేదో ఎండల తీవ్రత వల్ల అనుకుంటున్నారా? కాదు..ఎన్నికల వేడి వల్ల. కలెక్టరేట్‌లో పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించే కార్యక్రమం ప్రారంభమైంది. దీంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. లోపలికి వాహనాలు, ప్రజలు వెళ్లకుండా బారికేడ్లు పెట్టారు. కలెక్టరేట్ ఉద్యోగులు... ముఖ్యంగా ఎన్నికల సిబ్బంది ఐడీ కార్డులను పరిశీలించి... కలెక్టరేట్ ప్రాంగణంలోకి విడిచి పెడుతున్నారు. సాధారణ ప్రజలకు ప్రవేశం లేదు. దీంతో కలెక్టరేట్ పరిసరాలు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మొత్తం ఈ ప్రాంతం పోలీసు వలయంలో ఉంది.

- విజయనగరం-ఆంధ్రజ్యోతి





పోలీసుల పహరా.. హెచ్చరిక బోర్డు



కలెక్టరేట్ ఆవరణ బోసిపోయిన దృశ్యం

రిక్షా... మైకు... ఓ గుర్తు!

ఓల్డ్ ఈజ్ గోల్డ్



పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఎన్నికలు వస్తే పల్లెల్లో సందడి అంతాఇంతా కాదు. ఇప్పుడైతే రకరకాల ప్రచార సాధనాలు వచ్చాయి గానీ... ఒకప్పుడు... అంటే దాదాపు నాలుగు దశాబ్దాల కిందట ప్రధాన ప్రచార వాహనం రిక్షానే. జనతా పార్టీ... జాతీయ కాంగ్రెస్, కాంగ్రెస్ ఎస్ తదితర జాతీయ పార్టీల అభ్యర్థులు బరిలో ఉండేవారు. అప్పట్లో రిక్షాలపై మైక్‌లతో ప్రచారం చేసేవారు. 'ఆవుదూడకే మన ఓటు... హస్తం గుర్తుకే మీ ఓటు... రాట్నం గుర్తుకే మన ఓటు... నాగలి పట్టిన రైతు గుర్తుకే మన ఓటు...' అంటూ ప్రచారం చేసేవారు. ఈ ప్రచారం ఎక్కువగా రిక్షాలపై సాగేది. రిక్షాలకు పోస్టర్లు అతికించి...ఓ వ్యక్తి వాటిలో కూర్చొని... మైకులో ప్రచారం చేసేవారు. అప్పట్లో జీపులపైనే అభ్యర్థులు ప్రచారానికి ఊరూరా తిరిగేవారు. జీపుల్లో ప్రచారానికి అభ్యర్థులు వస్తే వారి వెంట పిల్లలు పరుగులు పెట్టేవారు.

పైడిమాంబ ఆలయాల్లో ప్రతి నెలా చండీహోమాలు

విజయనగరం రూరల్: పైడిమాంబ దేవాలయాలు (మూడులాంతర్లు వద్ద వున్న చదురుగుడి, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడి) వద్ద ప్రతి నెల పౌర్ణమి నాడు పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన చండీహోమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో ప్రసాద్‌రావు తెలిపారు. గతంలో కేవలం మూలానక్షత్రం రోజున మాత్రమే చండీహోమాన్ని నిర్వహించేవారమని, భక్తులు, పురోహితులు సూచించిన మీదట ఉన్నతాధికారులతో సంప్రదించి, ఇక ప్రతి నెల, ఆ నెలలో వచ్చే పౌర్ణమి రోజున చదురుగుడి, వనంగుడిలో చండీయాగం నిర్వహించడానికి నిర్ణయించామన్నారు. భక్తులు పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని తోటపాలెం సబ్‌స్టేషన్‌లో లోడ్‌ని సవరించడం, కొత్తగా ఏర్పాటు చేయబోయే 11కేవీ ఫీడర్ బ్రేకర్, దానికి సంబంధించిన లైన్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు హరి తెలిపారు. సింగపూర్‌సిటీ ఫీడర్, 11కేవీ డెంకాడ ఫీడర్, విభజన పనుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

రేపు నెల్లిమర్లలో..

నెల్లిమర్ల: మండలంలోని సీతారామునిపేట, వాటర్‌వర్క్స్ ఫీడర్ల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల నిర్వహణ పనుల నిమిత్తం ఆయా ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ అధికారి పి.హరి తెలిపారు. ఫలితంగా సీతారామునిపేట, గొర్లెపేట, కొత్తపేట, ఎంఆర్వో కార్యాలయం, కస్తూర్బా పాఠశాల, మిమ్స్ వైద్య కళాశాల ప్రాంతాలవారికి సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

ఎస్.కోటలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

శృంగవరపుకోట: శృంగవరపుకోటలో గురువారం 5 ఎం.వి.ఏ అదనపు పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు ఈ చర్యలు చేపట్టారు. స్థానిక సబ్‌స్టేషన్ వద్ద సుమారు రూ.1.25 కోట్ల వ్యయంతో దీన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు, జిల్లా రూరల్ ఈఈ జి.సురేష్ బాబు, ఎంఅండ్‌పీటీఆర్‌ఈ ఈఈ సత్యనారాయణ, డి.ఫణికిరణ్‌కుమార్, డీఈ బి.వెంకటరావు, ఏఈ ఆర్.రవికుమార్ ఉన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

నెల్లిమర్ల: జరజాపుపేటలో ఈనెల 21న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, విజయనగరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గరివిడి: మండలంలో శుక్రవారం గరివిడి, గర్భాం ఫీడర్ మెయింటనెన్స్ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వెదుళ్లవలస, ఆవగూడెం, కుమరాం పాలవలస, తాటిగూడ, గెడపువలస, వీపీ రేగ, లవిడాం, పెదబంటుపల్లి, రేగటి, రౌతుపేట, డి.కణపాక, గెడ్డపువలస, రూరల్ గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని, ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పూడి హరి తెలిపారు.

రేపు జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక పోటీలు

నెల్లిమర్ల: చిత్తూరు జిల్లాలో మే 3 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక పోటీలు నెల్లిమర్ల మండలంలోని కొండగుంపాం గ్రామంలో శనివారం నిర్వహిస్తున్నట్టు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వెంకటరమణ, పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17, అండర్-23 కేటగిరీల్లో ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. అండర్-17కు 2009, 2010 సంవత్సరాల్లో జన్మించినవారు, అండర్-23 పోటీలకు 2002, 2003, 2004 సంవత్సరాల్లో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపిక పోటీలకు వచ్చే క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డులు తీసుకురావాలని వారు సూచించారు.

ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శన

నెల్లిమర్ల: సాధారణ ఎన్నికలు 2024 నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు గురువారం విడుదల చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం బోర్డు మీద పత్రాలను అతికించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.ధర్మరాజు, ఎన్నికల విభాగం డీటీ వీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

నియంతృత్వ పాలనకు ఆఖరి రోజులు

దత్తిరాజేరు: నియంతృత్వ పాలనకు ఆఖరి రోజులు దాపురించాయని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పాచలవలస గ్రామానికి చెందిన 120 కుటుంబాలు, చినకాద గ్రామానికి చెందిన 150 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారిని గురువారం గజపతినగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

గుర్ల: మండలంలోని సోలిపిసోమరాజుపేట, ఎస్ఆర్‌పేట గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చనమాల మహేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. ఐటీడీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ విమలారాణి, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగులపల్లి నారాయణరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి పిల్లా అప్పలనాయుడు, కె.సూర్యనారాయణ, కె.కృష్ణ, కె.మధుబాల, కె.శ్రీరాములు పాల్గొన్నారు.

22న గాజులరేగ ముత్యాలమ్మ పండుగ

విజయనగరం రూరల్: నగరంలోని ముత్యాలమ్మ పండుగ ఈ నెల 22న జరగనుంది. 22న తొలేళ్ల ఉత్సవం, 23న ప్రధాన పండుగ జరగనుంది. ఏటా ఉగాది అనంతరం జరిగే అమ్మవారి పండుగను గాజులరేగ వాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో భారీగా నిర్వహించనున్నారు. మేళతాళాలు, నేలవేషాలు సందడి చేయనున్నాయి. అదితి గజపతిరాజు, వైసీపీ అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి తదితరులు ఈ నెల 23న ముత్యాలమ్మవారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు జరిగాయి. తమ, తమ నాయకులను రప్పించి, వారిచేత ప్రత్యేక పూజలు చేయించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పలువురు టీడీపీలో చేరిక

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో గురువారం వైసీపీ నుంచి 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. స్థానిక పొలమరశెట్టి వీధిలోని గౌరీసేవా సంఘం భవన యూత్ ఆధ్వర్యంలో వీరిని టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్‌ఎంపీపీ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఇందుకూరి సుధారాణి, మండల పార్టీ అధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు, సర్పంచ్ గనివాడ సంతోసి కుమారి తదితరులున్నారు.

కుంగుతున్న రోడ్లు..

- బొబ్బిలి అగురువీధిలో సొంతంగా పూడ్చుకుంటున్న స్థానికులు
- టీడీపీ వార్డు కావడంతోనే శ్రద్ధ చూపడంలేదంటూ ఆరోపణ

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని ఆరోవార్డు పరిధిలో అగురువీధిలోగల సిమెంట్ రోడ్లు ఉన్నట్టుండి కుంగిపోతున్నాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడడంతో వాహనచోదకులు, చిన్నారులు, వృద్ధులు తరచూ ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా ఫలితం లేకపోవడంతో స్థానికులే చొరవతీసుకుని ఆ గుంతలను సొంతసొమ్ముతో పూడ్చుకుంటున్నారు. తెలుగుదేశం కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు కావడంతోనే అభివృద్ధిపై మునిసిపాలిటీ పెద్దగా శ్రద్ధ చూపడం లేదని వార్డు ప్రజలు వాపోతున్నారు. వీధిలో రోడ్లు, కాలువలు, కల్వర్టులు పూర్తిగా పాడైపోయాయని, తక్షణమే మరమ్మతు చేయించాలని, పటిష్ఠమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఐదు, ఆరు వార్డులకు ఉమ్మడిగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్లు, కాలువల నిర్మించాలని తనతో పాటు ఆరో వార్డు కౌన్సిలరు, మునిసిపల్ ఫ్లోర్‌లీడరు గెంబలి శ్రీనివాసరావు కలిసి పలు దపాలు అధికారులు, మునిసిపల్ చైర్మన్ దృష్టికి తెచ్చామని, అయినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఐదోవార్డు కౌన్సిలరు వెలగాడ హైమావతి ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ వార్డులు కావడంతోనే పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు.



అగురువీధిలో పాడైన రోడ్డు, బాగుచేసుకున్న స్థానికులు, అగురువీధిలో మరో చోట ఇలా..

విజయనగరమంతా సమస్యలే: అదితి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 18: విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, వారి అనుచరులు విజయనగరం వెలిగిపోతున్నదని చెబుతున్నారని? తాను విజయనగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించినప్పుడు సాధారణ లైట్లు సైతం వెలగడం లేదని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నగరంలోని 41వ డివిజన్ నుంచి 50 డివిజన్లకు చెందిన డివిజన్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు, డివిజన్ కార్యవర్గ సభ్యులతో ఆమె మాట్లాడారు. విజయనగరం అభివృద్ధి చేశామని చెబుతున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి 2019 నుంచి 2024 వరకూ ప్రభుత్వం నుంచి ఎన్ని నిదులు తెచ్చారో? చెప్పాలని, తాము కోరినా.. ఆయన నుంచి ఉలుకు.. పలుకు కరువైందన్నారు. ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు శ్రమించాలన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారు బాబు, కర్రోతు నర్సింగరావు, అవనాపు విజయ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

వేంకటేశ్వర స్వామికి వెండి కిరీటం

విజయనగరం రూరల్: పైడిమాంబ దేవస్థానం దత్తతాలయమైన శివాలయం వీధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వెంకటేశ్వర స్వామికి బాలాజీ పట్టణ మహిళా సమాజం ఒక కేజీ 225 గ్రాముల వెండి బుట్ట కిరీటాన్ని బహూకరించింది. ఈ సంస్థ ఏర్పాటై 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ బృహత్తర కార్యక్రమానికి సమాజం సభ్యులు శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు పి శ్రీనివాసాచార్యులు చేతుల మీదుగా దీనిని పైడిమాంబ దేవస్థానం సూపరిండెంటెంట్ ఏడుకొండలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ, బాలాజీ మహిళా సమాజం ప్రతినిధులు స్వామి వారి సేవలో ఉంటారన్నారు. ఈ వెండి కిరీటాన్ని స్వామి వారికి అలంకరించాలని పురోహితులకు ఆలయ నిబంధనల ప్రకారం అందజేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయ సిబ్బంది, అర్చకులు, బాలాజీ మహిళా సమాజం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వెండి బుట్ట కిరీటాన్ని బహూకరిస్తున్న దాతలు

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

భోగాపురం: కూటమి గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగ మాధవి అన్నారు. గురువారం పోలిపల్లి గ్రామంలో టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లిమర్ల అభివృద్ధి కోసం కూటమిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్లమెంట్ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ నీలాపు అప్పలరామిరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సీరపు శ్రీను, కోరాడ తాతారావు, ఉపాధ్యక్షుడు కోలా రామసూరి, తెలుగు యువత అధ్యక్షుడు సరగడ తోగులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లోకం నాగమాధవి

రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యం

గరివిడి (మెరకముడిదాం): రాష్ట్రాభివృద్ధి కూటమితోనే సాధ్యమని చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు తెలిపారు. మెరకముడిదాం మండలం గర్భాం గ్రామంలో గురువారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మాజీ ఎంపీపీ తాడ్డి కృష్ణారావు తనయుడు చంద్రశేఖర్, ఆయన వర్గీయులు సుమారు 500 కుటుంబాలు కళా సమక్షంలో టీడీపీలో చేరాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు, కేటీఆర్, కోట్ల సుగుణాకరరావు, పార్టీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసి నాయుడు, మాజీ ఎంపీపీ కోట్ల మోతిలాల్‌నాయుడు, పులిగుమ్మి సర్పంచ్ తలచుట్ల ఈశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న కళా

గరివిడి: కూటమి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావును విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం రాత్రి గరివిడి టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన ఎంపీ నామినేషన్‌కు హాజరు కావాలని కళాను కోరారు. రాజకీయ సలహాలు తీసుకున్నారు. ● కె.పాలవలస సర్పంచ్ మీసాల ప్రసాద్‌ను కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు గురువారం ఆయన స్వగ్రామం వెళ్లి కలిశారు. టీడీపీ మండల నాయకులు పైల బలరాం, బలగం వెంకటరావు, సారిపాక సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

దత్తిరాజేరు: పప్పల లింగాలవలస గ్రామంలో టీ డీపీ విజయనగరం పార్లమెంట్ బీసీ సాధికారిత కొప్పల వెలమ జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు.

బాబుతోనే భవిష్యత్తు: కోండ్రు

రాజాం: చంద్రబాబుతోనే భావితరాల భవిష్యత్తు సాధ్యపడుతుందని, యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాజీ మంత్రి, కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ స్పష్టం చేశారు. శ్యాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు, సంతకవిటి మండలం అప్పల అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి బొడ్డేపల్లి అప్పలనాయుడు సహా 70 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కొల్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పోలినాయుడు, బగాది వెంకటరమణ, గుడ్ల అప్పారావు తదితరులంతా పార్టీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



రేగిడి మండలం వైసీపీ నాయకులను ఆహ్వానిస్తున్న మురళీ

అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలు

బొబ్బిలి, ఏప్రిల్ 18: బొబ్బిలి ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనా యన , మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడులు గురువారం సాయంత్రం పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీలో మహిళలు, పార్టీ నాయకులు ఇతర అభిమానులంతా వారికి సాదర స్వాగతం పలికా రు. హారతులు పట్టి, కుంకుమ బొట్లు పెట్టి ఆశీర్వదించారు. స్థానిక మదరసాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్ బాబు, వార్డు నాయకులు బొద్దాన అప్పారావు, తెర్లి రామ్మోహనరావు, చంద్ర, గౌరి, జనసేన నాయకులు పాలూరు బాబు, సంచాన గంగాధర్, బంటుపల్లి దివ్య, సుంకరి సాయిరమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బేబీనాయన

రామభద్రపురం: మండల పరిధిలోని జన్నివలస గ్రామానికి చేందిన 35 కుటుంబాలు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. గురువారం జనసేన కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరి బాబు, వీరందరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భవిరెడ్డి మహేష్, జనసేన నాయకులు కనకల శ్యామ్, అల్లు రమేష్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి.. కేసు నమోదు

వేపాడ, ఏప్రిల్ 18: వ్యక్తిపై కత్తితో దాడి చేసి పీక కోసిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వావిలపాడు గ్రామంలో కొచ్చెర్ల సన్యాసిరావు, ఆరిపాక సంతోష్ ఇరుగుపొరుగు ఇళ్లలోనే నివసిస్తున్నారు. ఇద్దరూ సరదగా, సన్నిహితంగా ఉండేవారు. ఈ క్రమంలో ఎప్పటిలాగే గురువారం ఉదయం సన్యాసిరావు ఇంట్లోకి సంతోష్ వెళ్లి.. మాట్లాడుతూ ఉన్నట్టుండి సన్యాసిరావు పీకపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో సన్యాసిరావు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని తక్షణమే కే.కోటపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించగా ఆస్పత్రిలోనే ఉన్నాడు. దాడికి పాల్పడిన ఆరిపాక సంతోష్ వల్లంపూడి పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు సంతోష్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేశారు.

వలంటీర్లతో బలవంతపు రాజీనామాలా?

బొబ్బిలి: వలంటీరు వ్యవస్థతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓట్ల రాజకీయాలు చేయడం సిగ్గుచేటని జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు ఆకుల దామోదరరావు అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అధికార, ప్రతిపక్షపార్టీలు వలంటీర్ల పట్ల అనుసరిస్తున్న వైఖరిపై ప్రజలంతా ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారన్నారు.

అభివృద్ధే గెలిపిస్తుంది

వేపాడ: గతంలో చేపట్టిన అభివృద్ధే ఈ ఎన్నికల్లో గెలిపిస్తుందని శృంగవరపుకోట ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని జాకేరు, కరకవలస, చామలాపల్లి, దబ్బిరాజుపేట గ్రామాల్లో గురువారం ఆమె డోర్‌టూ డోర్ కార్యక్రమంలో బాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్‌కోటలో తనని, పార్లమెంట్ స్థానానికి భరత్‌ను గెలిపించాలని కోరారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం



శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానంలో గురువారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వసంత నవరాత్రుల ముగింపు సందర్భంగా శ్రీరామ నవమిని పురస్కరించుకుని బుధవారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించిన సంగతి తెలిసిందే. గురువారం శ్రీరాముని పట్టాభిషేకం చేశారు. శ్రీరాముని శిరస్సుపై బంగారు కిరీట ధారణ చేశారు. అంతకు ముందు యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. కలశలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రామాయణంలోని పట్టాభిషేక సర్గ విన్నపంచేశారు. పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలను ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

లక్కవరపుకోట, ఏప్రిల్ 18: మండలంలో సోంపురం కూడలికి దగ్గరలో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస చింతలదిమ్మకు చెందిన పాకలపాటి శ్రీనివాసరాజు(47)పై కొద్దిరోజుల కిందట బాలికపై అత్యాచార ఘటనలో పోక్సో కేసు నమోదైంది. దీంతో పోలీసులకు దొరకకుండా పరారీలో ఉన్న శ్రీనివాసరాజు గురువారం సోంపురం కూడలికి దగ్గరలో శవమై కనిపించాడు. పొలంపని చేసుకుంటున్న రైతుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోక్సో కేసు నమోదైందన్న కారణంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుని తల్లి పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బాడంగి, ఏప్రిల్ 18: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ జయంతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో చినభీమవరం గ్రామానికి చెందిన ఉయ్యాల నూకందొర (51) మద్యం, పేకాటకు బానిసై గ్రామంలో రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పుల భారం పెరగడం, అప్పు తీర్చేందుకు అవకాశం లేకపోవడంతో ఈ నెల 16న ఉదయం పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు నూకందొరను స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 17న రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వడదెబ్బపై అవగాహన

జామి: వేసవిలో వడదెబ్బ వల్ల కలిగే ప్రమాదంపై విద్యార్థుల తల్లిదండ్రులకు స్థానిక అల్లువీధి పాఠశాల ఉపాధ్యాయులు గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. పీహెచ్‌సీ సిబ్బందితో వడదెబ్బ ఎలా తగులుతుంది.. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కన్నుల పండువగా పట్టాభిషేకం

జామి, ఏప్రిల్ 18: మండలంలోని కుమరాం రామాలయంలో గురువారం శ్రీసీతారామ చంద్రులకు ప్రముఖ వేదపండితుడు శర్మ ఆధ్వర్యంలో పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'శారదా' ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామంలో ఉన్న శారదా మెటల్స్ అండ్ అల్లాయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలను కర్మాగార ప్రతినిధులు చేశారు. కొత్తవలసలోని కొత్తవలస-విజయనగరం రోడ్డులో ప్రజా మరుగుదొడ్లకు సంబంధించి భవనాన్ని ప్రారంభించారు. కొత్తవలస జడ్పీహైస్కూల్‌లో విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన వాష్ రూం ప్రారంభించారు. కొత్తూరు గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించారు. కర్మాగారానికి చెందిన ప్రతినిధులు ప్రభాత్‌కుమార్, కె.విజయభాస్కర్, సన్యాశిరావు, మురళీ కృష్ణ, వేణు, శంకరరావు , కె.సంతోష్ కుమార్, శివ కుమార్, కొత్తవలస జడ్పీహై స్కూల్ హెచ్ఎం ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవల్లో నిర్లక్ష్యం ఉండకూడదు

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాలు నిర్ధేశిత వేళలు పాటింపు, ప్రీస్కూల్ పిల్లల నిర్వహణ, పౌష్టికాహార పంపిణీలో లోపాలు లేకుండా కార్యకర్తలు బాధ్యత వహించాలని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండలంలో సంకిలి సెక్టారు పరిధిలో ఉన్న మజ్జిరామునిపేట, చిన్నయ్యపేట అంగన్వాడీకేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు.

ఎన్నికలకు సహకరించాలి

రామభద్రపురం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజల సహకరించాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. రూరల్ సి.ఐ తిరుమలరావు, స్థానిక ఎస్.ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో కొట్టక్కి, రొంపల్లి గ్రామాల్లో ఎన్నికలు, ప్రశాంత పోలింగ్ కోసం నినాదాలు చేసి, ర్యాలీలు చేశారు.

దివ్యాంగ ఉపకరణాలకు ఎంపిక

శృంగవరపుకోట: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు ఉపకరణాల ఎంపికకు గురువారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. నియోజకవర్గ పరిధిలోని శృంగవరపుకోట, జామి, ఎల్.కోట, వేపాడ, కొత్తవలస మండలాల నుంచి 302 మంది దివ్యాంగులు హాజరయ్యారు.